ఈ అబ్రామ్ ధర్మాత్ముడు. లోట్ సోడోమ్ అనే దైవవిరోధుల రాజ్యంలో వుంటూ కొందరు రాజుల చేతిలో ఓడిపోయినప్పుడు యితను కొందరి సహాయంతో అతన్నీ, సోడోమ్ రాజ్యాన్నీ రక్షించాడు. సోడోమ్ రాజు పట్ల ఉదారంగా వ్యవహరించాడు. దేవుడు దానికి సంతోషించి అబ్రామ్‌ను అభినందించబోతే "ఏం చేసినా ఏం లాభం? నాకు సంతానం లేకుండా చేశావ్ కదా" అన్నాడు అబ్రామ్. సంతానం కలుగుతుందని హామీ యిచ్చాడు దేవుడు. "అంతేకాదు నీ సంతతి వారు అపారంగా విస్తరించి కొంతకాలం పాటు దేశంకాని దేశంలో వేరేవారికి 400 సంవత్సరాలపాటు బానిసలుగా పడి వుంటారు. కానీ వారు అక్కణ్నుంచి విముక్తులై మళ్లీ యిక్కడికి వచ్చేస్తారు." అని కూడా చెప్పాడు. ("టెన్ కమాండ్‌మెంట్స్" సినిమాలో హీబ్రూలు ఈజిప్టునుండి తరలిరావడం, ఎఱ్ఱసముద్రం చీలి వారికి దారి నివ్వడం చూపిస్తారు కదా, దేవుడు దాని గురించే ముందుగా చెప్తున్నాడు)

కానాన్‌కి వచ్చిన పదేళ్లకు అబ్రామ్ భార్య సరాయ్ "దేవుడు నాకు ఎలాగూ పిల్లల నివ్వడం లేదు. కనీసం నా ఈజిప్షియన్ బానిస హాగార్‌తోనైనా కూడి నాకు పిల్లల నియ్యి" అంది. అబ్రామ్ వలన హాగార్ గర్భవతి కాగానే ఆమె తన యజమానురాలిని చులకన చేయసాగింది. దాంతో యిదంతా నీ కారణంగానే అని సరాయ్ భర్తను నిందించింది. ఆమెతో నీ యిష్టం వచ్చినట్టు వ్యవహరించు అన్నాడు అబ్రామ్. అప్పణ్నుంచి సరాయ్ హాగార్‌ను బాగా వేధించింది. దానితో ఆమె పారిపోయింది. దారిలో దేవదూత కనబడి "ఇంటికి తిరిగి వెళ్లు. నీకు ఇషామెల్ అనే కుమారుడు కలిగి అతని ద్వారా నీ వంశం వృద్ధి చెందుతుంది." అని చెప్పాడు. ఆమె తిరిగి వచ్చింది. చెప్పినట్టే ఇషామెల్ పుట్టాడు.

అబ్రామ్‌కు 99 ఏళ్ల వయసు వున్నపుడు దేవుడు కనబడి "నువ్వు కొన్ని జాతులకు పితామహుడివి కాబోతున్నావు. నీ సంతతి తామరతంపరగా వర్ధిల్లుతుంది. నేను కాపాడుతాను. నేను నీతో చేసుకున్న యీ ఒప్పందానికి గుర్తుగా పుట్టిన ప్రతి మగబిడ్డకు 8 వ రోజున సున్తీ చేయించు. (ముస్లిములలో కూడా యీ సంప్రదాయం వుంది కానీ కాస్త పెద్దయిన తర్వాత చేయిస్తారు) అలా సున్తీ చేయబడినవాళ్లే నా వాళ్లు. ఇకపై నీ పేరు అబ్రహామ్, నీ భార్య పేరు సారా. ఆమె వలన మరో కొడుకు పుడతాడు." అన్నాడు. అబ్రహాం (ఇకపై అతన్ని యీ పేరుతోనే వ్యవహరిద్దాం) నవ్వాడు "నాకు 99. నా భార్యకు 90. అన్నీ ఉడిగిపోయాయి. ఇంకేం పిల్లలు?" అని. "వచ్చే ఏడాది యీ పాటికి ఆమె తల్లి అవుతుంది. వాడికి ఇసాక్ అనే పేరు పెట్టు" అన్నాడు దేవుడు.

ఓ సారి అబ్రహాం యింటికి దేవుడు, మరో యిద్దరు అతిథులుగా వచ్చారు. "సోడోమ్ రాజ్యంలో దుష్టత్వం పెరిగిపోయిందని విన్నాను. వెళ్లి ఆ నగరాన్ని నాశనం చేస్తాను" అన్నాడు. అప్పుడు అబ్రహాం "నగరాన్ని నాశనం చేస్తే చెడ్డవాళ్లతో బాటు మంచివాళ్లు కూడా శిక్షింపబడతారు కదా. ఒక ఏభై మంది పుణ్యాత్ములు కనబడితే వారికోసం నగరాన్ని రక్షించవచ్చు కదా" అన్నాడు. "నువ్వు చెప్పినది బాగుంది. ఒక ఏభై మంది కనబడితే నగరాన్ని ఏమీ చేయను" అన్నాడు దేవుడు. "...ఏభైమంది లేరనుకో, నలభైమంది వున్నారనుకో, అప్పుడైనా వాళ్లకోసమైనా తక్కినవారిని కాపాడవచ్చు కదా.." అన్నాడు అబ్రహాం. "సరే, అలాగే కానీ, నలభైమంది వున్నా చాలు" అన్నాడు దేవుడు. ఇలా బేరాలాడి..లాడి చివరకు పదిమంది వున్నా కాపాడతానని దేవుడి వద్ద మాట తీసుకున్నాడు అబ్రహాం.

ఇద్దరు దేవదూతలు ఓ సాయంత్రం వేళ సోడోమ్ నగరానికి చేరారు. అబ్రహాం అన్న కొడుకు లోట్ వారిని తన యింటికి ఆహ్వానించాడు. వారు ఆతిథ్యం అక్కరలేదన్నా మొహమాటపెట్టి యీ రాత్రికైనా తలదాచుకోండి అంటూ యింట్లోకి తీసుకెళ్లాడు. ఆ సంగతి తెలిసి సోడోమ్ ప్రజలు అతని యిల్లు చుట్టుముట్టి ఆ వచ్చినవాళ్లను బయటకు పంపమని కేకలు వేశారు. లోట్ బయటకు వచ్చి "కావాలంటే కన్యలైన నా కుమార్తెలను మీ పరం చేస్తాను కానీ వచ్చిన అతిథులను ఏమీ చేయకండి" అని బతిమాలాడు. దేవదూతలు లోట్ ప్రవర్తనతో సంతోషించారు. వచ్చినవాళ్లను గుడ్డివాళ్లను చేసి తరిమేశారు. తెల్లవారుఝామునే లోట్‌తో చెప్పారు – "దేవుడు యీ నగరాన్ని నాశనం చేయబోతున్నాడు. సూర్యోదయం లోపునే నువ్వు, నీ భార్య, నీ కూతుళ్లు వెనక్కి తిరిగి చూడకుండా యిక్కడనుండి వెళ్లిపోండి." అని. ఆ తర్వాత దేవుడు సోడోమ్, గోమోరా నగరాలపై నిప్పులు కురిపించి వాటిని నాశనం చేశాడు. లోట్ భార్య ఆ శబ్దానికి వెనక్కి తిరిగి చూసింది. మరుక్షణంలో ఉప్పుస్తంభంగా మారిపోయింది. లోట్ తన యిద్దరు కూతుళ్లతో జోర్ నగరానికి చేరాడు కానీ అక్కడ వుండడానికి భయపడి కొండగుహల్లో వుండసాగాడు.

ఓ రోజు లోట్ యిద్దరు కూతుళ్లు తమలో తాము తర్కించుకున్నారు– "ఇక్కడ నాన్న తప్ప వేరే మొగాడు కనుచూపు మేరలో లేడు. మనకు సంతానం కలగాలంటే నాన్నే గతి. అతన్ని బాగా తాగించి మన కోరిక తీర్చుకుందాం" అని. అలాగే తాగించి, అతనికి స్పృహలేని స్థితిలో పెద్దకూతురు కలిసింది. మర్నాడు రెండో కూతురు. పెద్ద కూతురు తన కొడుక్కి మోవాబ్ అని పేరు పెట్టింది, రెండో కూతురు తన కొడుక్కి బెన్‌అమ్మి అనే పేరు పెట్టింది. వారి పేర వారి వంశాలు వెలిశాయి.

ఇవతల అబ్రహాంకు నూరు సంవత్సరాల వయసులో సారా ద్వారా ఇసాక్ అనే కొడుకు పుట్టాడు. వాడు తన సవితి కొడుకైన ఇషామెల్‌తో కలిసి ఆడుకోవడం సహించలేక "ఈ బానిసను, దాని కొడుకును యిక్కణ్నుంచి పంపేయ్" అంది సారా భర్తతో. అబ్రహాం యిష్టపడలేదు కానీ దేవుడు కూడా ఇషామెల్‌ను కాపాడతానని హామీ యివ్వడంతో పంపేశాడు. దేవుడు వారికి పరాన్ లో ఆశ్రయం కల్పించాడు. ఇషామెల్ పెరిగి పెద్దవాడై మంచి విలుకాడు అయ్యాడు. అతని తల్లి ఈజిప్టునుండి పిల్లను తెచ్చి పెళ్లి చేసింది. అతని సంతానం ఈజిప్టుకి ఎదురుగా నున్న అస్సీరియాలో స్థిరపడ్డారు.

ఒకసారి దేవుడు అబ్రహాంకు పరీక్ష పెట్టాడు. తన కుమారుణ్నే తనకు బలిగా యిమ్మన్నాడు. దానికి కూడా అబ్రహాం సిద్ధపడడంతో దేవుడికి చాలా సంతోషం కలిగింది. నీ సంతతిని ఎప్పటికీ కాపాడతానని మాట యిచ్చాడు. (శిరియాళ కథలో కూడా దేవుడు యిలాటి పరీక్షే పెడతాడు, అక్కడ మరీ ఘోరం. వండి పెట్టమంటాడు. ఇక్కడ కత్తి ఎత్తి చంపబోతూంటే ఆపేస్తాడు) 127 సం॥ల వయసులో సారా చనిపోయింది. ఇసాక్‌కు యుక్తవయసు వచ్చింది. అబ్రహాం మంచాన పడ్డాడు. తన కుమారుడికి తగిన వధువు గురించి తన స్వంతదేశం వెళ్లమని నౌకరుకు పురమాయించాడు. రెబెకా కథ వచ్చే గురువారం. (సశేషం) **– ఎమ్బీయస్ ప్రసాద్**

**(జూన్ 2011)**